క్లుప్తంగా

నేడు విస్తృతస్థాయి సమావేశం

తాళ్లరేవు: స్థానిక లయన్స్‌క్లబ్ భవనంలో శెట్టిబలిజ సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. సమావేశానికి మండలంలోని శెట్టిబలిజ సోదరులందరూ హాజరుకావాలని సంఘ ప్రతినిధులు గంజా సూరిబాబు, టేకుమూడి లక్ష్మణరావు, పిల్లి సత్తిబాబులు కోరారు.

స్వామీజీకి డాక్టరేట్



వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న కొల్లు స్వామీజీ

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధి అంబేడ్కర్ నగర్‌కు చెందిన కొల్లు స్వామీజీ సోమవారం విశాఖపట్టణం ఆంధ్ర యూనివర్సిటీ స్నాతకోత్సవంలో భాగంగా వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ ఇళ్ల దోసగిరిరావు పర్యవేక్షణలో భారతదేశంలో బలహీన వర్గాల సాధికారిత- ప్రజాస్వామ్యం వికేంద్రీకరణ అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించిందని స్వామీజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను సర్పంచ్ ఇసుకపట్ల జయమణి, రఘుబాబు, జంగా శ్రీనివాస్, కొల్లు బాలమురళీకృష్ణ తదితరులు అభినందించారు.

కనీస వేతనాలు పెంచుతూ నోటిఫికేషన్

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా షాపులు తదితర సంస్థల్లో పనిచేసే కార్మికుల కనీస వేతనాలు పెంచుతూ కార్మికశాఖ కార్యదర్శి పి.రజిని సోమవారం నోటిఫికేషన్ జారీచేశారు. మేనేజర్, సేల్స్ మేనేజర్ పోస్టులకు రూ.10,658, అకౌంటెంట్, సూపర్‌వైజర్‌లకు రూ.10,246, సేల్స్‌మెన్, రిప్రజెంటేటివ్‌లకు రూ.10,205, వాటర్‌బోయ్, డెలివరీబోయ్, స్వీపర్‌లకు రూ.10,094, ఫార్మాసిస్ట్, కెమిస్ట్‌లకు రూ.10,658 చెల్లించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు యానాం అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ లేబర్‌కు సైతం వివరాలను తెలియజేశామన్నారు.

ఆరోగ్య సురక్ష అమలుకు రెండు బృందాలు

అమలాపురం టౌన్: ఈ నెల 19వ తేదీ వరకూ అమలాపురం మున్సిపాలిటీలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం అమలు కోసం రెండు బృందాలను ఏర్పాటుచేసినట్లు కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు సోమవారం తెలిపారు. టీమ్ నెంబర్–1 పేరుతో కమిషనర్, రెవెన్యూ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్, టీమ్ నెంబర్–2 పేరుతో మున్సిపల్ మేనేజర్, ఏఈ, జూనియర్ అసిస్టెంట్‌లను నియమించారు. అలాగే రిజిస్ట్రేషన్ల కోసం ఒక డెస్క్, వెరిఫికేషన్ కోసం మరో డెస్క్, సర్వీస్ రిక్వెస్ట్ కోసం ఇంకో డెస్క్ మొత్తం 3 డెస్క్‌లు ఏర్పాటుచేసినట్లు వివరించారు. పౌరుల ఆరోగ్య అవసరాలను గుర్తించేందుకు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయడం, సంప్రదింపులు, చికిత్స, రిఫరల్ కోసం ఆరోగ్య శిబిరాలు, డోర్ క్యాంపెయిన్లను నిర్వహిస్తారన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

యానాం: ఎటువంటి పింఛన్ పథకాలు తీసుకోని, కుటుంబానికి యజమానిగా ఉన్న మహిళలకు మహిళా, శిశు అభివృద్ధి శాఖ ద్వారా నెలకు రూ.1,000 ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సోమవారం తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఎరుపురంగు రేషన్ కార్డు కలిగి ఉన్నవారు అర్హులన్నారు. దరఖాస్తులు తన కార్యాలయంలో ఇస్తున్నారని వాటిని తీసుకుని పూర్తి చేసి ఇవ్వాలని కోరారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి

యానాం: యానాం పట్టణంలో మళ్లీ పునఃప్రారంభమవుతున్న రీజెన్సీ సిరామిక్స్ పరిశ్రమలో స్థానికులకు 50 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని స్థానిక బీజేపీ నాయకులు కాదా పవన్, పెసల వెంకటేష్, హరిప్రసాద్ కోరారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో రీజెన్సీ ఫ్యాక్టరీ ద్వారా వేలాదిమందికి యాజమాన్యం ఉపాధి కల్పించిందన్నారు. మూసివేసిన ఫ్యాక్టరీని తెరవడంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కృషిపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఫ్యాక్టరీ తెరవడంతో యానాంకు పూర్వ వైభవం వస్తుందని చెప్పారు.

పంచాయతీ పేరు మార్చాలంటూ వినతి

అల్లవరం: ఎస్.పల్లిపాలెంలో అన్నివర్గాలు ఉన్నందున పంచాయతీ పేరును మార్చాలంటూ స్థానికులు సోమవారం అమలాపురంలోని స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాని కలిసి వినతిపత్రం అందించారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ కమీషనర్ కోన శశిధర్‌కు సైతం రిజిస్టర్ పోస్టులో వినతి పత్రం పంపించినట్లుగా తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు వెంకటరమణ, కొల్లా సత్యనారాయణ, పచ్చిమాల పూజ, ఎం.సాహెబ్, సీహెచ్ నాగలక్ష్మి, పి.అర్జునరావు, మంగాదేవి, సీహెచ్ మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఖజానా ఖాళీ.. ప్రభుత్వానికేదీ జాలి..

- ఆర్థిక సంక్షోభంలో యానాం మున్సిపాలిటీ
- సిబ్బందికి జీతాలు ఇవ్వలేక ఆపసోపాలు
- 12 ఏళ్లుగా ఎన్నికలు జరగక రాని కేంద్ర నిధులు

యానాం: యానాం మున్సిపాలిటీ ఖజానా ఖాళీ అయిపోయిందా అంటే అవుననే సమాధానమే వినపడుతోంది. నిధులు లేకపోవడంతో గత ఏడు నెలల నుంచి మున్సిపల్ సిబ్బందికి కనీసం జీతాలు, విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు సైతం ఇవ్వలేని దుస్థితి నెలకొంది. 12 ఏళ్లుగా మున్సిపాలిటీ పాలక వర్గానికి ఎన్నికలు జరపకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. మరోవైపు ఆస్తి పన్ను వసూలులోనూ వెనకబడిపోవడం, ఆదాయాన్ని పెంచుకునే మార్గాలవైపు దృష్టి సారించకపోవడంతో యానాం మున్సిపాలిటీ వద్ద నిధులు నిండుకున్నాయన్న చర్చ సర్వత్రా సాగుతోంది.



జీతాల కోసం మున్సిపల్ సిబ్బంది నిరాహారదీక్ష (ఫైల్)

మున్సిపాలిటీకి సుదీర్ఘ చరిత్ర

యానాం ప్రాంతానికి 400 ఏళ్లకు పైగానే చరిత్ర ఉంది. రాజధాని పుదుచ్చేరికి 870 కిలోమీటర్ల దూరంలో ఉన్న యానాం పట్టణం జనవరి 26, 1974లో మున్సిపాలిటీగా రూపుదాల్చింది. ప్రత్యేక అధికారిగా రీజినల్ అడ్మినిస్ట్రేటర్, కమిషనర్‌లను నియమించారు. మున్సిపాలిటీ మొత్తంగా పుదుచ్చేరిలోని లోకల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్(ఎల్‌ఏడీ) ఆధ్వర్యంలో పనిచేస్తుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం యానాం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 65 వేల మంది నివసిస్తున్నారు. మున్సిపాలిటీకి 2006లో ఎన్నికలు జరిగాయి. పాలక వర్గం కాలపరిమితి 2011లోనే ముగిసిపోయినా అప్పటినుంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేదు. అదే ప్రధాన సమస్యగా పరిణమించింది.

మంజూరు కాని కేంద్ర నిధులు

మున్సిపాలిటీలకు సమయానికి ఎన్నికలు జరిపి పాలకవర్గాలు ఏర్పడితేనే ఏటా కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయి. అయితే యానాం మున్సిపాలిటీలో బీసీ రిజర్వేషన్ తేలకుండా ఎన్నికలు నిర్వహించడానికి వీల్లేదంటూ స్థానికంగా కొన్ని రాజకీయపార్టీల ప్రతినిధులు సుప్రీంకోర్టుని ఆశ్రయించాయి. మరోవైపు స్థానికంగా కొందరు రాజకీయ నేతలు సైతం ఎన్నికల నిర్వహణకు సుముఖంగా లేరన్న వాదన వినిపిస్తుంది. ఈ కారణాలతో యానాం మున్సిపాలిటీకి గత 12 ఏళ్లుగా ఎన్నికలు జరగక కేంద్ర నిధులు పూర్తిగా నిలిచిపోయాయి. ఎన్నికలు జరిగితే ఏడాదికి తక్కువలో తక్కువ రూ.5 కోట్ల వరకూ కేంద్రం గ్రాంట్లు రూపేణా వచ్చేవని సామాజికవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఎన్నికలు జరగని కారణంగానే యానాంతో పాటు మాహే, కారైకల్, పుదుచ్చేరి మున్సిపాలిటీలకు కేంద్రం నిధులు నిలిపివేసింది. స్థానికంగా పరిశ్రమలు మూతపడడంతో వచ్చే పన్నులు సైతం నిలిచిపోయాయి. దీనికి తోడు ప్రజలు చెల్లించాల్సిన ఇంటి పన్నుల వసూళ్లపైనా దృష్టిసారించేవారు కరవయ్యారు. మున్సిపాలిటీకి 110 షాపులున్నా వాటి అద్దె బకాయిలు సైతం రూ.లక్షల్లో పేరుకుపోయాయి.

ఉద్యోగుల ఆశలు ఆవిరి

మున్సిపాలిటీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకోవడంతో గత ఏడు నెలలుగా మున్సిపల్ ఉద్యోగులకు జీతాలివ్వడం లేదు. 52 మంది విశ్రాంత ఉద్యోగులకు బెనిఫిట్స్ రూపేణా రూ.3.20 కోట్లు, 64 మంది ఉద్యోగులకు నెలకు రూ.42 లక్షల చొప్పున ఏడు నెలల నుంచి జీతాలు మొత్తం కలిపి రూ.5 కోట్లు ఇవ్వాల్సివుంది. సీఎం రంగసామితో మున్సిపల్ ఉద్యోగులు చర్చించిన తర్వాత ఆయన బడ్జెట్‌లో మున్సిపల్ ఉద్యోగుల జీతాల బిల్లు ప్రవేశపెడతామని హామీ ఇచ్చారు. దీంతో ఈ ఏడాదైనా బడ్జెట్‌లో తమ బకాయి జీతాల బిల్లు అసెంబ్లీలో పెడతారని పలువురు మున్సిపల్ ఉద్యోగులు భావించినా అదీ జరగకపోవడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి. ఆర్థిక సంక్షోభం కారణంగా యానాంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా పుదుచ్చేరి ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

ఆదాయం తక్కువగా ఉంది

మున్సిపాలిటీ ఆదాయం తక్కువగా ఉన్న కారణంగా మున్సిపల్ సిబ్బంది జీతాలు ఆలస్యం అవుతున్నాయి. పుదుచ్చేరి ఎల్ఏడీ డైరెక్టర్‌తో మాట్లాడి త్వరలోనే జీతాలు వచ్చేలా ప్రయత్నిస్తున్నాం.

– అరుల్‌ప్రకాశం, మున్సిపల్ కమిషనర్, యానాం మున్సిపాలిటీ

త్వరగా జీతాలు చెల్లించాలి



మున్సిపాలిటీ ఉద్యోగులకు ఏడు నెలలుగా జీతాలు ఇవ్వలేదు. జీతాలు రాక ఎల్ఐసీ ప్రీమియం సైతం కట్టలేక పోతున్నాం. దీంతో ఎవరైనా మృతి చెందితే క్లెయిమ్ అవడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల జీతాలొచ్చేలా చూడాలి.

– సబ్బతి నూకాంబరం, మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు, యానాం

శ్రీదేవి ఉత్సవ కమిటీ సేవలు అభినందనీయం



కలెక్టర్ హిమాన్షు శుక్లాకు ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని అందిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో అమలాపురం శ్రీదేవి ఉత్సవ కమిటీ సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. స్థానిక కలెక్టరేట్‌కు ఉత్సవ కమిటీ ప్రతినిధులు సోమవారం వెళ్లి కలెక్టర్‌కు దసరా ఉత్సవాల జంబో ఆహ్వాన పత్రాన్ని అందించి ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని అభినందించారు. కలెక్టర్‌ను కలిసినవారిలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు గంగాబత్తుల వీర వెంకట సత్యనారాయణ(జీవీ), మామిడిపల్లి రాము, వెలిగట్ల జగదీష్, గంగాబత్తుల వెంకన్నలున్నారు.

ప్రత్యేక రాష్ట్ర హోదాపై ప్రధానిని కలుస్తా

– సీఎం రంగసామి

యానాం: పుదుచ్చేరికి ప్రత్యేక రాష్ట్ర హోదా ఇవ్వాలని కోరుతూ అనేకసార్లు అసెంబ్లీలో తీర్మానం చేసినా కేంద్ర ప్రభుత్వం మాత్రం కేంద్ర పాలిత ప్రాంతంగానే ఉంచుతామని ఇటీవల ప్రకటించిన నేపథ్యంలో త్వరలో పుదుచ్చేరి ఎమ్మెల్యేలతో కలిసి ఢిల్లీలో ప్రధాని మోడీని, హోంమంత్రిని కలవనున్నట్లు సీఎం రంగసామి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టేట్‌హుడ్‌పై ఇప్పటికే 13 సార్లు అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఈ ఏడాది మార్చి నెలలో సైతం 14వ సారి తీర్మానం చేసి ఎల్జీ తమిళిసై ద్వారా కేంద్రానికి పంపామని చెప్పారు. యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ ప్రాంతాలతో కలిపి ప్రత్యేక రాష్ట్ర హోదాను డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర హోదా ద్వారానే పుదుచ్చేరి అభివృద్ధి చెందుతుందన్నారు.

పోరాట యోధుడు జక్కంపూడి



జక్కంపూడి రామ్మోహన్‌రావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు కిరణ్ తదితరులు

అమలాపురం టౌన్: మాజీమంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు పోరాట యోధుడని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ అన్నారు. జక్కంపూడి రామ్మోహన్‌రావు వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక నల్లవంతెన సమీపంలోని ఆయన విగ్రహానికి కిరణ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మద్దింశెట్టి ప్రసాద్, కల్వకొలను ఉమ, మామిడిపల్లి రాము, పెచ్చెట్టి నాని, కోటిపల్లి బాపన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం

- గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

ముమ్మిడివరం: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టిందని ఎంపీపీ కోలా గంగాభవాని పేర్కొన్నారు. మండలంలోని గేదెల్లంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 530 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కోలా బాబ్జీ, ఎంపీడీఓ జె.రాంబాబు, తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ, ఈఓపీఆర్‌డీ సీహెచ్‌ఎల్ కల్యాణి, అదనపు జిల్లా వైద్యాధికారి భరతలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు జంపన శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ప్రతిఒక్కరూ మెరుగైన వైద్యం పొంది ఆరోగ్యంగా ఉండాలని సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. శిబిరంలో 372 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. 144 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, పుత్సాల ఏసు, బళ్ల సతీష్, ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఈఓపీఆర్‌డీ కేఎస్ గౌరీకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: మండలంలోని సుంకరపాలెం గ్రామ పంచాయతీ వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 355 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు చేతుల మీదుగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ రాంబాబు, చేదూరి అరవింద్, పలివెల రాము తదితరులు పాల్గొన్నారు.



రోళ్లపాలెంలో వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా అదనపు డీఅండ్‌హెచ్‌వో భారతలక్ష్మి

అల్లవరం: మండలంలోని మొగళ్లమూరు సచివాలయం వద్ద సర్పంచ్ రాయుడు విష్ణు త్రిమూర్తులు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 466 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన వలంటీర్లకు సర్పంచ్ విష్ణు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, డీటీ వీర వెంకట సత్యనారాయణ, డాక్టర్లు సుమ, స్పందన, శాంతిప్రియ, నీలోఫర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేసిందని జిల్లా అదనపు డీఅండ్‌హెచ్‌వో భారతలక్ష్మి అన్నారు. సోమవారం రోళ్లపాలెంలోని ప్రాథమికోన్నత పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ మట్టా వైదేహి ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు ములపర్తి శాంతిలక్ష్మి, చంద్రశేఖర్ వాసు నాయక్, స్వర్ణకమల ఆధ్వర్యంలో 350 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గుబ్బల మల్లికార్జునరావు, కార్యదర్శి రెడ్డి శిరీష తదితరులు పాల్గొన్నారు.



విలసవిల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి తదితరులు



సుంకరపాలెంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న ఎంపీపీ కోలా గంగాభవాని

చంద్రకుమార్‌కు క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు

అమలాపురం రూరల్: క్రియేటివ్ హార్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వేదికగా నిర్వహించిన వందే వేద భారతం చిత్ర కళా పోటీల్లో పాలగుమ్మి చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు అందుకున్నారు. చిత్రకారుడు ఎం.రాంబాబు, మాడా రాము, స్కూల్ చైర్మన్ మను విహార్, సంస్కార భారతి అధ్యక్షుడు ఆకొండి పవన్ కుమార్‌ల చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

పౌష్టికాహారంపై అవగాహన సదస్సులు



జనుపెల్లి సురక్ష శిబిరంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ కుమార్

అమలాపురం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహారంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అమలాపురం మండలంలో తాండవపల్లి, జనుపెల్లి, ఇందుపల్లి, ఈదరపల్లి, కామనగరువు, పాలగుమ్మి గ్రామాల్లో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటుచేశారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో అమలు చేస్తున్న టేక్ హోమ్ న్యూట్రిషన్ ద్వారా ప్రతి నెలా గర్భిణులు, బాలింతలకు రూ.850 విలువైన అయిదు లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, మూడు కిలోల బియ్యం, అర కిలో ఆయిల్, కిలో కందిపప్పు, రెండు కిలోల రాగి పిండి, ఒక కిలో అటుకులు, పావు కిలో బెల్లం, పావు కిలో వేరుశెనగ చిక్కీ, పావు కిలో ఎండు ఖర్జూరం పంపిణీ చేస్తున్నారు. దీనిపై ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుచేసి ప్రచారం చేస్తున్నారు.

రాష్ట్ర సదస్సుకు తరలి రావాలి

అమలాపురం రూరల్: అమలాపురం షాదీఖానాలో బుధవారం జరగనున్న రాష్ట్ర సదస్సుకు కౌలు రైతులు తరలి రావాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రచార జాతాలో భాగంగా అమలాపురం మండలం వన్నెచింతలపూడి, తాండవపల్లి, భట్నవిల్లి, వేమవరం, వేమవరప్పాడు, జనిపెలి, గుడాల, కోడూరుపాడు, అల్లవరం, ఎంట్రికోన, డి.రావులపాలెం, దేవగుప్తం, సరిపల్లి, గోపవరం, కూనవరం, ఉప్పలగుప్తం తదితర గ్రామాల్లో కౌలు రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీమాల శ్రీను, విప్పర్తి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం వర్ధంతి

ఐ.పోలవరం: మండలంలోని ఎదుర్లంకలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కాన్షీరాం 17వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఎస్పీ పార్టీ నియోజకవర్గ అసెంబ్లీ ఇన్‌చార్జి కాశి లక్ష్మి భవాని నేతృత్వంలో తొలుత కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌతమ్ అశోక్, నాగవరపు ఏడుకొండలు, పెండెం శ్రీనివాస్, పాము శేషగిరి, వడ్డి ఏడుకొండలు, జీఎస్‌డీ రాజు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని ఎ.వేమవరప్పాడులో బహుజన సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకులు కాన్సీరాం 17వ వర్ధంతి కార్యక్రమం అమలాపురం నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్సీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోలా త్రిమూర్తులు, నాగరపు ఏడుకొండలు, బుడితి దయామహేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంతో ఉపయోగాలు

రాజోలు: డ్రోన్ ద్వారా పంట పొలాల్లో మందులు పిచికారీ చేయడం ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త భరతలక్ష్మి అవగాహన కల్పించారు. సోమవారం కడలి గ్రామంలో వరి పంటపై తెగుళ్లు, పురుగుల నివారణకు డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీ చేసే విధానం వివరించారు. కేవలం పది నిమిషాల్లో ఒక ఎకరం పొలంలో పురుగు మందును పిచికారీ చేయవచ్చన్నారు. డ్రోన్ వినియోగించడం ద్వారా సమయం, వ్యయం ఆదా చేసుకోవచ్చని అన్నారు. వ్యవసాయ అధికారుల బృందం జ్యోతిర్మయి, రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి వై.మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కడలిలో డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసే విధానం వివరిస్తున్న శాస్త్రవేత్తలు

తైక్వాండో పోటీల్లో ప్రతిభ

అంబాజీపేట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో అంబాజీపేట క్రీడాకారులు 12 బంగారు, 7 వెండి, 6 కాంస్య పతకాలను సాధించినట్లు అంబాజీపేట తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో తైక్వాండో క్రీడాకారులను సోమవారం పలువురు అభినందించారు. 8న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో 29వ ఇంటర్ క్లబ్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. సబ్ జూనియర్ కేటగిరీలో డి.జెస్సీలేకణ, కె.ఆస్య, కె.లాస్యాఅద్విక, జి.లాహితితేజ, ఎం.మౌనికలు బంగారు, డి.గిరిజ, ఎస్.కావ్య, సీహెచ్ఎన్ చిన్న వెండి, వి.దినేష్, ఇ.బంగారయ్య, బి.హేమహితిక్ కాంస్య పతకాలు సాధించారన్నారు. కెడిట్ విభాగంలో కాంస్య, జూనియర్ విభాగంలో వెండి, సీనియర్ విభాగంలో బంగారు పతకాలు పొందారన్నారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు వచ్చే నెల కడపలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారన్నారు. విజేతలను హెచ్ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, తైక్వాండో కోచ్‌లు, ఉపాధ్యాయులు అభినందించారు.



అంబాజీపేటలో పతకాలు సాధించిన క్రీడాకారులు

విశ్రాంత విద్యాశాఖాధికారి మృతికి సంతాపం

యానాం: యానాం విశ్రాంత ప్రాంతీయ విద్యాశాఖాధికారి జయశ్రీ(78) మృతిపై స్థానిక యానాం పెన్షనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు పడాల వెంకటేశ్వరరావు, పూర్వపు విద్యార్థులు, పలువురు ఉద్యోగులు సోమవారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

శౌర్య జాగరణ యాత్రకు ఘన స్వాగతం



రాజోలులో శౌర్య జాగరణ యాత్రకు స్వాగతం పలుకుతున్న సభ్యులు

రాజోలు: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో చేపడుతున్న శౌర్య జాగరణ యాత్రకు సోమవారం రాజోలులో ఘన స్వాగతం లభించింది. అయోధ్యలో రామాలయం నిర్మాణం పూర్తి కావొస్తున్న సందర్భంగా యాత్ర నిర్వహిస్తున్నట్టు కోనసీమ అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం తెలిపారు. బైక్ ర్యాలీ, మహిళల కోలాటంతో భజన చేస్తూ హనుమాన్ రథాన్ని ఊరేగించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్, పద్మావతి, నూలు శ్యామల, నీరజ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

పి.గన్నవరం: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి అన్నారు. నరేంద్రపురం గురుకుల పాఠశాలలో మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ పి.వేణు అధ్యక్షతన సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు స్నేహభావంతో ఉండాలని, ఉపాధ్యాయుల పట్ల గౌరవ భావంతో మెలగాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించారు. మమత స్వచ్ఛంద సేవా సమితి గౌరవాధ్యక్షుడు నల్లా పెదకాపు, కోరుకొండా రాజు, అధ్యాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై హరికోటి శాస్త్రి

బాలుడికి కుక్క కాటు

యానాం: పట్టణ పరిధిలోని మెట్టకూరు రామన్నకోడు ప్రాంతానికి చెందిన నాటి లక్ష్మణరావు అనే బాలుడిపై సోమవారం కుక్క దాడి చేసింది. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న లక్ష్మణరావు స్కూల్‌కి వెళుతుండగా మార్గం మధ్యలో కుక్క దాడి చేసి గాయపరిచింది. దీంతో బాలుడిని స్థానిక జీజీహెచ్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. మెట్టకూరు పరిధిలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని వాటిని నిర్మూలించాలని స్థానికులు కోరుతున్నారు.